


# కరెంటు సంబరం

**మా** చిన్నతనంలో కరెంటు ఉండేది కాదు మా ఊళ్ళో. హాల్లోలాంతరు ఇనపకొక్కేనికి తగిలించేవారు. వంటింట్లోనూ, పడకగదిలోనూ లాంతరులు. మిగిలినచోట కోడిగుడ్డు దీపాలు. చేత్తో పుచ్చుకుని తిరిగేందుకు రెండు చిన్న లాంతరులుండేవి. సాయంత్రంపూట ఆ దీపాలన్నీ దగ్గరపెట్టుకుని కిరసనాయిలు పోసి ముగ్గుతో గ్లాసులన్నీ మసి లేకుండా తుడిచి, కత్తెరతో వత్తులు కత్తిరించి సిద్ధంగా పెట్టుకునేది అమ్మమ్మ.

చీకటిపడగానే దీపాలు వెలిగించేవాళ్ళు. భాగ్యవంతుల ఇళ్ళలో పెట్రోమాక్స్ లైట్లు వుండేవట.

ఒకసారి మేము సెలవులకు వెళ్ళినప్పుడు ఊరంతా సందడి. ఊళ్ళకి కరెంటు వస్తుందట! స్తంభాలకోసం గుంటలుతవ్వడం, అంత ఎత్తున్న వైరుచుట్టలు తేవడం అన్నీ విచిత్రంగా చూశాం. అయిదారిళ్ళవాళ్ళు ఇంటికి కరెంటు పెట్టించుకోవాలనుకున్నారు. అందులో మా ఇల్లు ఒకటి.

ముందు సంబరపడినా ఆ తర్వాత భయపడింది మా అమ్మమ్మ. "ఆ కరెంటీ ప్రమాదకరమైనదిట కదా! మన పార్వతమ్మ వదినగారి దూరపుచుట్టం బెజవాడలో కరెంటీకి అతుక్కుపోయి గుటుక్కుమన్నాడట. ఇప్పుడా కరెంటీ లేకపోతే ఏం? ఇన్నాళ్ళూ గడవలేదా? అట్లాగే గడుస్తుంది" అంది.

"ప్రమాదం ఏమీలేదు. కరెంటు వస్తే ఆ సులువువేరు. కాస్త జాగ్రత్తగా వుంటేచాలు" అంది అమ్మ.

"ఏమోనమ్మా! కాళ్ళకి రబ్బరుచెప్పులు వేసుకోవాలిట. లేకపోతే నేలకి అతుక్కుపోతారుట. అలా అతుక్కుపోతే ఇంకెవరైనా రబ్బరుచెప్పులు వేసుకుని వచ్చి కర్రతో అతుక్కుపోయినవాళ్ళని కొడితేగానీ ఊడిరావుట కాళ్ళు. ఈ వయసులో రబ్బరుచెప్పులు వేసుకుని ఏం తిరుగుతాను?" అంది అమ్మమ్మ.

అమ్మ ఫకాలున నవ్వింది. "ఎవరా చెప్పింది, మా ఊళ్ళో కరెంటు లేదూ! నేను చెప్పులేసుకుని తిరుగుతున్నానా? అక్కడికి వచ్చినప్పుడు నువ్వు చెప్పులేసుకుని తిరుగుతున్నావా? ఆ మాటలేం నమ్మకు" అని తీసిపారేసింది.

అమ్మతో వాదించలేక ఊరుకున్నా మా దగ్గర వాపోయేది.

"మీ అమ్మకేం... చెప్తుంది. అక్కడైతే మీరందరూ వున్నారు. ఇక్కడ మేమిద్దరమే వుంటాం. పోనీ నేను నేలకి అతుక్కుపోతే మీ తాతయ్య ఓ దెబ్బ వేసినా ఫర్వాలేదుగానీ ఆయన అతుక్కుపోయారనుకో.. కట్టుకున్న భర్తని కర్రతో ఎట్లా కొడతాను? రౌరవాది నరకాలు పట్టిపోనూ? ఎందుకొచ్చిన ప్రారబ్ధం ఇదంతా" అని బాధపడింది.

"అలా ఏం కాదులే అమ్మమ్మా. మా ఊళ్ళో కరెంటువుంది. ఎవరూ నేలకి అతుక్కుపోలేదు" అని ధైర్యం చెప్పాం.

"మీది బస్తీ కరెంటీ. ఇది పల్లెటూరి కరెంటీ. దానికున్న తెలివితేటలు దీనికుండద్దూ" అంది.

ఆవిడ ఎంత ప్రతిఘటించినా వినలేదు. ఇంట్లో వైరింగ్ చేసి బల్బులు బిగిస్తుంటే మళ్ళీ అడ్డుపడిందిట. "అంటే అన్నానంటారు. అంత ఎత్తున దీపాలు పెడితే నేను ముగ్గుపెట్టి ఎట్లా తుడుచుకుంటాను? కాస్త నేలబారుకి బిగించండి" అందిట. వాళ్ళు నవ్వేసి "ఈ దీపాలు రోజూ తుడవక్కర్లేదమ్మా. మసి ఉండదు కదా" అన్నారుట.

ఎలాగైతేనేం... కరెంటు వచ్చేసింది. ఆ శుభసందర్భంలో మేమంతా వెళ్ళాం. తాతగారు సంబరంగా ఉన్నారుగానీ అమ్మమ్మకి సవాలక్ష సందేహాలు... అమ్మ సమాధానాలు.

"ఒక్కొక్కచోట ఒకటే మీట పెడితే సరిపోయేది. ఇక్కడ మూడు మీటలు పెట్టారు. ఒకటి వంటగదిలోకి, రెండోది భోజనాల గదిలోకి, మూడోది దొడ్లోకట. ఒకటి వెయ్యబోయి ఇంకొకటి వేస్తే ప్రమాదం కాదా!"

"ఏమీ కాదు. అది ఆర్పేసి ఇంకొకటి వెయ్యాలి."

"సరే! కరెంటీ దీపం ఉండగా లాంతరు వాడితే కరెంటీ దీపానికి కోపం వస్తుందా?"

"కోపం రావడానికీ, తాపం రావడానికీ అదేమైనా మనిషా? అయినా కరెంటు దీపం వుండగా మళ్ళీ లాంతరు ఎందుకు?"

అలా ఎన్నో అనుమానాలు...

ఆ తర్వాత కొన్నాళ్ళకి మళ్ళీ వెళ్ళాం.

"నేను చదువుకోనిదాన్ననీ, ఏమీ తెలియనిదాన్ననీ తాటాకులు కట్టేస్తారు. కరెంటీకి కోపం ఎందుకొస్తుందీ అంది మీ అమ్మ. ఆ కరెంటీకి వున్నంత చుప్పనాతితనం ఇంకెవరికీ ఉండదు. మామూలప్పుడు పుచ్చపువ్వుల్లా వెలుగుతాయా దీపాలు! మొన్నామధ్య గోవిందరాజువాళ్ళు మనింటికొచ్చినప్పుడు ఠపీమని ఆరిపోయాయి. అదేమిటంటే కరెంటీ పోయిందిట. అట్లా పరాయివాళ్ళు వచ్చినప్పుడు పోవడం మర్యాదేనా? ఆనక అంతా అయిపోయి వాళ్ళు వెళ్ళాక తీరిగ్గా వచ్చింది. నాకీ కరెంటీ పద్ధతేం నచ్చటంలేదు. నయానాభయానా చెప్పమంటే మీ తాతయ్య వినరు" అని చెప్పుకుని బాధపడింది.

ముందర కొంచెం అస్తావ్యస్తాపడినా తరువాత కరెంటుదీపాలు చూసి మురిసిపోయింది అమ్మమ్మ.

గాలికి అల్లల్లాడవు. మసిబారిపోవు. బ్రహ్మముడి వేసుకున్నట్లు వెంట తీసుకుపోనక్కర్లేదు. చక్కగా పొందికగా ఉన్నచోటే ఉండి పుచ్చపువ్వులా మెరిసిపోతాయి అని సంబరాలు పడేది.

కరెంటు వచ్చాక ఆవిడ హోదా కూడా పెరిగింది.

పక్కింటి రాఘవమ్మగారు దొడ్డిగోడనుంచి కేకేసి "వదినా! ఇంట్లో గాలాడడం లేదు. పిల్లవెధవలకి దొడ్లో అన్నం పెడతాను. కాస్త మీ లైటు వెలిగిస్తావా?" అని అడిగేది.

"అయ్యో! దానికేం భాగ్యం" అని వెనకాల లైటు వేసేది అమ్మమ్మ.

మర్నాడు తెల్లవారాక ఆవిడ వచ్చి "ఎంతైనా కరెంటుదీపం మహిమే వేరు. మాకొద్దు, మాకు చాలు అని సూకిరాలు పోయే పిల్లలు ఇంకాస్త ఇంకాస్త అంటూ ఇత్తడి గిన్నెడు అన్నం ఊడ్చిపెట్టేశారు వదినా" అని ఫీడ్‌బేక్ ఇస్తే-

"అవును వదినా! అదివరకు నా కీళ్ళు కీచుకీచుమంటూ ఉండేవి. కరెంటీ దీపాలు వచ్చాక సాఫీగా సాగుతున్నాయమ్మా" అన్నది అమ్మమ్మ.

ఈ విషయం విని అపోజిషను పార్టీలోని జగన్నాథంగారి భార్య మంచినీళ్ళ బావిదగ్గర ఎద్దేవా చేసిందట. "మరీ బడాయి కాకపోతేనూ... కరెంటుదీపంతో కాళ్ళనెప్పులూ కీళ్ళనెప్పులూ తగ్గుతాయా?" అందిట.

అది తెలుసుకుని "ముక్కానీ ఆవదం దీపాలవాళ్ళు కూడా కరెంటీ గురించి మాట్లాడుతుంటే ఏం చెప్తాం? దమ్ముంటే వందరూపాయలు పెట్టి ఇంట్లోకి కరెంటీ పెట్టించుకుని నెల తిరిగేసరికి మూడూముప్పావలా కరెంటీ ఖర్చు కట్టమను తెలుస్తుంది...సత్తా ఏమిటో. అయినా అమావాస్యనాడు వెన్నెల్లో భోజనం చేస్తాననే తెలివి తక్కువది. దానికేం తెలుసు కరెంటీ గొప్ప?" అంది మా అమ్మమ్మ గర్వంగా.

* * *